# వసుంధర

# కామన్వెల్త్ క్రీడల్లో మా ఉత్పత్తులే!



**ఆమె తయారుచేసే పళ్లాలూ, కప్పులూ, చెంచాలూ, ట్రేలూ, డబ్బాలూ... చూడ్డానికి చాలా సాధారణంగానే కనిపిస్తాయి. కానీ అవన్నీ మొక్కల గుజ్జు, పీచు నుంచి తయారుచేసినవి. ఈ వినూత్న ప్రయోగంతో ఆమె దేశవ్యాప్తంగానే కాదు... ఆస్ట్రేలియా, దుబాయ్ లాంటి చోట్లకూ తన ఉత్పత్తులమ్మే స్థాయికి చేరుకుంది. దిల్లీకి చెందిన రియా సింఘాల్ వ్యాపార ప్రస్థానమిది.**



ఒకప్పుడు పన్నెండు మందితో ప్రారంభించిన మా పర్యావరణ హిత సంస్థలో ఇప్పుడు వందమంది సిబ్బంది ఉన్నారు. పది కోట్ల రూపాయల టర్నోవరుకు చేరుకున్నా. రెండో శాఖనూ విస్తరించా. దిల్లీ, ముంబయి, బెంగళూరు, హైదరాబాద్‌లకు మాత్రమే కాదు.. ఆస్ట్రేలియా, దుబాయ్ లాంటిచోట్లకూ నా ఉత్పత్తుల్ని పంపిస్తున్నా. ఇదంతా ఎలా సాధ్యమైందో చెప్పే ముందు నా గురించి చెబుతా. నేను పుట్టింది ముంబయిలో అయినా... దుబాయ్, లండన్‌లలో ఎక్కువగా పెరిగా. బ్రిస్టల్ యూనివర్సిటీలో ఫార్మకాలజీ చదివా. తరవాత లండన్‌లోనే ఓ ప్రముఖ సంస్థలో సీనియర్ సేల్స్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేశా. నా చదువు ఫార్మకాలజీ కాబట్టి.. ఎలాంటి రసాయనాలూ, వ్యర్థాలూ శరీరంలోకి వెళ్తాయి, అవి ఎలాంటి అనారోగ్యాలు తెచ్చిపెడతాయి లాంటి అంశాలపై నాకు ముందునుంచీ అవగాహన ఉంది. ఏదయినా కొత్తగా చేద్దామని అనుకుంటుండగానే 2009లో నా పెళ్లయింది. మా వారితో పాటూ దిల్లీకి వచ్చేశాను.

## అది చూసి ఆశ్చర్యపోయా..

దిల్లీకి వచ్చిన కొన్నిరోజులకు ఓ రెస్టారంట్‌కి వెళ్లా. అక్కడి వాళ్లని చూసినప్పుడు చాలామందికి ఆరోగ్యంపై అవగాహన పెరిగిందని అనిపించింది. అయితే చాలా మంది తీసుకెళ్లే ఆహార పార్సిళ్లు ప్లాస్టిక్‌వే. పదార్థాలను వేడివేడిగా అందులో ఉంచినప్పుడు, ఆ వేడికి ప్లాస్టిక్‌లోని రసాయనాలు శరీరంలోకి సులువుగా చేరతాయి. దాంతో రకరకాల క్యాన్సర్లూ, ఇతర సమస్యలూ దాడిచేస్తాయి. తిన్న తరవాత వాటిని ఎలాగూ పారేస్తాం. కానీ అవి ఓ పట్టాన భూమిలో కలిసిపోవు. అదీ సమస్యే. ఇవన్నీ చూశాక పర్యావరణానికి మేలుచేసేలా వాడి పారేసే విధంగా పదార్థాలుంచే డబ్బాలూ, పళ్లాల వంటివి తయారుచేయాలన్న ఆలోచన వచ్చింది. వెంటనే రెస్టారంట్లూ, హోటళ్లలో ప్యాక్ చేసేందుకు ఎటువంటి పళ్లాలూ, డబ్బాలూ వాడతారన్న దానిపై అధ్యయనం చేశా. ఏ సైజుల్లో ఉన్నవి ఎక్కువగా వినియోగదారులు తీసుకెళుతున్నారూ, పర్యావరణానికి మేలు చేసేవి అమ్మితే తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నారా అనీ అడిగి తెలుసుకున్నా. చాలామటుకు సానుకూల స్పందనే వచ్చింది. సాధారణంగా పదార్థాలు ప్యాక్ చేసే వాటిల్లో థర్మాకోల్, స్టైరోఫోమ్, పెట్రోలియం ఆధారిత ప్లాస్టిక్‌తో చేసినవే ఎక్కువగా ఉంటున్నాయి. కానీ నేను చేసే ఉత్పత్తులు అలాంటి వాటితో కాకుండా విభిన్నంగా ఉండాలనుకున్నా. ఆ దిశగా వివిధ దేశాల్లో సంస్థలు ఎటువంటి ఉత్పత్తుల్ని తయారుచేస్తున్నాయని ఆరా తీశా. నెట్‌లో వెతికా. నిపుణులతో మాట్లాడా. అప్పుడు తెలిసింది ప్లాంట్ బయోమాస్ గురించి. మొక్కల గుజ్జు, పీచు ద్వారా కప్పులూ, పళ్లాల్ని తయారుచేయొచ్చని. పూర్తి అవగాహన వచ్చాక 'ఎకోవేర్' పేరుతో సంస్థను ప్రారంభించా. ఎలాంటి రసాయనాలూ, క్రిమిసంహారకాలూ లేకుండా ఉత్పత్తుల్ని తయారుచేయడం మొదలుపెట్టా. పళ్లాలూ, డబ్బాలూ, ట్రేలూ... ఏవయినా సరే మొదట్లో వాటి సైజూ, డిజైన్‌కు సంబంధించి చాలా ప్రయోగాలు చేశా. వివిధ రకాల్లో తయారీపై పట్టు సంపాదించా.

## మొదటిసారి కామన్వెల్త్ ఆటలకోసం..

వీటిని చేసిన వెంటనే అమ్మేయడానికి వీల్లేదు. ముందు పరీక్షల కోసం ల్యాబ్‌కి పంపడం తప్పనిసరి. అందుకే మా ఉత్పత్తులతో పాటూ, అవి వందశాతం ఎలా సురక్షితం, తిని పారేశాక కూడా అవి భూమిలో ఎలా కలిసిపోతాయో వివరిస్తూ పరీక్షలకు పంపాం. ఆ ఉత్పత్తులు పరిశోధించి, అభివృద్ధి పరచడానికి తొమ్మిదినెలలు పట్టింది. మన దేశంలోని ల్యాబ్‌లలో అర్హత ప్రమాణాలని సాధించి ఐఎస్ఓ అర్హత పొందడమే కాదు... అమెరికాలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చర్ వారి నుంచీ సర్టిఫికెట్‌ని పొందా. ఆ తరవాతే అమ్మడం మొదలుపెట్టాం. కానీ ఇదీ చెప్పినంత సులువుగా జరగలేదు. పోషకాహారం తీసుకోవడానికి ప్రాధాన్యం ఇవ్వడం పెరిగింది కానీ... ఏ పళ్లెంలో తింటే ఏంటీ... ఎక్కువ ధర పెట్టాలా అని ఆలోచించే వారూ చాలామందే. స్కూళ్లూ, కాలేజీలూ, ఇతర సంస్థలకు వెళ్లి నా ఉత్పత్తుల గురించి వివరించేదాన్ని. అయినప్పటికీ అవగాహన తక్కువే. ఆసక్తిగా తీసుకునేవారూ తక్కువే. దానికితోడు ఇది పూర్తిగా పురుషాధిక్యత ఎక్కువగా వ్యాపారం. నేను ఇలాంటి ఉత్పత్తులు తయారుచేస్తున్నానని తెలిసినప్పుడు.. నా దగ్గర పనిచేసేవారే కాదు, డిస్ట్రిబ్యూటర్లూ, బయటివారూ. ... 'ఇరవై ఏడేళ్ల వయసు అమ్మాయి. తనకేం తెలుసు..' అని అనుకున్నవారే. అలాంటి సమయంలోనే అంటే 2010లో కామన్వెల్త్ క్రీడలు దిల్లీలో జరిగాయి. అప్పుడు 'గ్రీన్ గేమ్స్' పేరుతో పర్యావరణానికి మేలుచేసే ఉత్పత్తుల వాడకంపైనే నిర్వాహకులు దృష్టిపెట్టారు. నేను వెంటనే వాళ్లని కలిశాను. వెంటనే ఆర్డరిచ్చారు. ఆ క్రీడలు జరిగినన్నాళ్లూ సుమారు పదిహేను లక్షలకు పైగా పళ్లాలూ, చెంచాలూ, ఫోర్క్‌లూ, ట్రేలూ, కప్పులూ తయారుచేసి అందించాం. ఇదే నా మొదటి ఆర్డరు. కానీ చాలా పెద్దది. లాభాలను తెచ్చిపెట్టింది. దీంతో దిల్లీలో మా సంస్థ పేరు అందరికీ తెలిసింది. రెస్టారంట్లూ, ఆస్పత్రులూ, పెళ్లి మండపాల వాళ్లు.... మమ్మల్ని సంప్రదించడం మొదలుపెట్టారు.

## హైదరాబాద్‌కీ విస్తరించా..

మేం తయారుచేసే ఉత్పత్తుల్లో ఎలాంటి రంగు ఉండవు. అన్నీ సహజంగానే ఉంటాయి. ఇవీ వివిధ సంస్థల్ని ఆకట్టుకున్నాయి. ప్రస్తుతం మేం పద్నాలుగు రకాల ఉత్పత్తుల్ని రకరకాల సైజుల్లో తయారుచేస్తున్నాం. బెంగళూరులోని గోల్డ్‌మన్‌శాక్స్‌లోనూ మా ఉత్పత్తులు ఉంటాయి. ఒబెరాయ్ గ్రూప్ ఆఫ్ హోటళ్లూ, తాజ్ హోటళ్లూ, హల్దీరామ్స్, దేశంలోని ప్రముఖ విమానాశ్రయాల్లో వాడేవి మా ఉత్పత్తులే. కెనడా, దుబాయ్, ఆస్ట్రేలియాలకూ వీటిని ఎగుమతి చేస్తున్నాం. హైదరాబాద్‌లో వెస్టిన్ హోటల్ రిసార్ట్, షెరటన్, నొవొటెల్, అపోలో, కేర్ హాస్పిటళ్లు, ఎన్‌గ్రిల్, సైబర్ సిటీ కన్వెన్షన్, సిజిలింగ్ గ్రిల్... వంటి వాటిల్లో మా ఉత్పత్తులు ఉంటాయి. ప్రముఖ సంస్థలూ, హోటళ్లే కాదు... దిల్లీలోని కొన్ని స్కూళ్లూ, కిట్టీపార్టీలు చేసుకునే మహిళలూ మా వినియోగదారుల జాబితాలో ఉన్నారు. వీటిని ఆన్‌లైన్‌లోనూ అమ్ముతాం. వీటి తయారీకి అవసరమయ్యే పంటల్ని మా ఫ్యాక్టరీకి 250 కిలోమీటర్ల దూరంలోనే ఉండేలా ఏర్పాటు చేసుకున్నా. దీన్ని ప్రారంభించిన ఐదేళ్లలో దిల్లీలోనే కాదు. . నోయిడాలోనూ మరో శాఖను తెరిచా. ఇంటింటా మా ఉత్పత్తులు ఉండాలన్నదే నా ఆలోచన. కాబట్టి దీన్ని ఇంకా విస్తరించడమే నా ప్రయత్నం.

– హెచ్. శ్రీలక్ష్మి